క్లుప్తంగా

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు

తరిగొప్పుల: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుగులోత్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కోనేటి మణికంఠ అనే యువకుడు తన ఇంటికి సమీపంలో ఉంటున్న ఓ ముస్లిం యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భవతిని చేశాడు. కాగా కోనేటి మణికంఠ పెద్దలుకుదిర్చిన పెళ్లికి సిద్ధమవగా విషయం తెలుసుకున్న యువతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో బాధిత యువతి ఫిర్యాదు మేరకు మణికంఠపై కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీ కోరకు శనివారం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా యాదగిరి



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన కావటి యాదగిరి సీపీఐ మండల కార్యదర్శిగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని కంచనపల్లిలో పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి సమక్షంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో నూతన మండట కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా యాదగిరి, సహాయ కార్యదర్శిగా కందుకూరి మల్లేశం, మండల సమితీ సభ్యులుగా పసుల దానియేలు, మడికంటి సోమయ్య, అబ్బయ్య, ముప్పిడి ఎల్లయ్య, గుండ్ల మురళి, బిర్రు నాగేశ్వర రావు, జెనిగల అంజయ్య, ఉడుముల జయమ్మ, తూడి శ్రీనివాస్, పండుగ మల్లేశం, కోమటిరెడ్డి నర్సిరెడ్డి, రాములు, సాధం అశోక్, రమేష్, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు సీపీఐ మండల మహాసభ

జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామంలో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు సీపీఐ మండల మహాసభను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలతో పాటు ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై మండల మహాసభలో సమీక్షించడంతో పాటు భవిష్యత్‌లో చేపట్టనున్న పోరాటాలపై రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పెండ్యాల సమ్మయ్య, ఎండీ యాకుబ్‌పాష, మంద బుచ్చయ్య, గట్టుమల్లు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ



భూమి పూజలో హెచ్‌ఎం తదితరులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సభా వేదిక నిర్మాణానికి హెచ్‌ఎం బి.వెంకట్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి హరిచరణ్.. ఆయన తండ్రి రాఘవ రాజు జ్ఞాపకార్థం సభావేదికను నిర్మించడానికి ముందుకు వచ్చారని తెలిపారు. హరిచరణ్ ఇంతకు ముందు పాఠశాలకు సైన్స్ ల్యాబ్‌ను అందించి ఇప్పుడు వేదిక నిర్మాణాన్ని చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ లత, ఉపాధ్యాయులు లక్ష్మీ నర్సమ్మ, కృష్ణమోహన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, రవికుమార్, రజిత, గట్టు రామచంద్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై విమర్శలు తగవు'



మాట్లాడుతున్న మంజుల

పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కృతుడైన వ్యక్తి .. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలపై విమర్శలు చేయడం తగదని చిట్యాల ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శనివారం మండలంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ రాఘవరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేశ్ నాయక్‌లతో కలసి మంజుల మాట్లాడారు. పెద్ది కృష్ణమూర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిల్లర రాజకీయాలు చేయడం వల్లనే బహిష్కృతుడయ్యాడని అన్నారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీలో గుర్తు ఉంటుందని అన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, కొడకండ్ల మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు ధరావత్ సురేష్, నాయకులు పాల్గొన్నారు.

లెదర్‌పార్కుకు మోక్షం లభించేనా?

- రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా భవనం
- దళితులకు ఉపాధి కల్పనపై పాలకుల నిర్లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న లెదర్‌పార్కు భవనం

స్టేషన్‌ఘన్‌పూర్: దళితులకు జీవనోపాధి కోసం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నామని పాలకులు చెపుతున్న మాటలు నీటిమీద రాతలుగా మారుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగినా, ప్రభుత్వాలు మారినా దశాబ్దాలుగా దళితులు జీవనోపాధి కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. దళితులపై పాలకుల నిర్లక్ష్యానికి శివునిపల్లి శివారులో 22 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న లెదర్‌పార్కు భవనం నిదర్శనంగా నిలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని దళిత నిరుద్యోగ యువకులు, చర్మకారులకు శాశ్వతంగా జీవనోపాధి కల్పించే లక్ష్యంగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి శివారులో 2003లో టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి కడియం శ్రీహరి హయాంలో మినీ లెదర్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. లెదర్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్‌క్యాప్) ఆధ్వర్యంలో దాదాపు 25 ఎకరాల స్థలంలో మినీ లెదర్‌పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.10లక్షలతో లెదర్‌పార్కు భవనం నిర్మాణం చేశారు. అనంతరం అందులో కుట్టుమిషన్లు, ఇతర యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు లెదర్‌పార్కు భవనం నిరుపయోగంగా ఉండగా భవనం శిథిలావస్థకు చేరింది. లెదర్‌పార్కు పై కప్పు వడగండ్ల వానలకు తూట్లు పడగా అందులో ఉన్న పరికరాలు తుప్పుపట్టి చెడిపోయాయి.

శిక్షణ ఇచ్చారు.. ఉపాధి మరిచారు

2004 సంవత్సరంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ తదితర మండలాల నుంచి చర్మ వృత్తులపై కాస్త నైపుణ్యం ఉన్న 50 మంది నిరుద్యోగ దళితులను ఎంపికచేసి వారికి చెన్నైలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. చర్మ ఉత్పత్తులైన లెదర్ బూట్లు, చెప్పులు, వేసుకునే కోట్లు, చేతి సంచులు, బెల్టులు, బ్యాగులు తదితర వస్తువుల తయారీలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వారిని మాస్టర్ ట్రైనర్లుగా గుర్తించి ఘన్‌పూర్‌లో వివిధ మండలాలకు చెందిన విడతల వారిగా దాదాపు 500 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇప్పించారు. దాంతో త్వరలో లెదర్‌పార్కు భవనం ప్రారంభిస్తారని, దళిత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశించారు. అయితే పాలకుల నిర్లక్ష్యంతో అనంతరం ప్రభుత్వాలు మారినా పాలకులు లెదర్‌పార్కు ఊసే ఎత్తడం లేదు. లెదర్‌పార్కును ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు రెండు వేల మందికి జీవనోపాధి లభిస్తుందని, దళిత సంఘాల నాయకులు, నిరుద్యోగులు ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు, పాలకులను కలిసి విన్నవించినా ఎలాంటి స్పందన లేదు. గతంలో లెదర్‌పార్కు భవనాన్ని కలెక్టర్‌లు సందర్శించడం, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అసెంబ్లీలో నేతలు ప్రస్తావించడం జరిగినా ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేదు. దాంతో దళితులు లెదర్‌పార్కుపై ఆశలు వదులుకున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు, దళిత నిరుద్యోగులు రోజువారి కూలీలలుగా, ఆటో డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి లెదర్‌పార్కు విషయమై ప్రత్యేక చొరవతో పనిచేసి లెదర్‌పార్కును ప్రారంభించాలని దళిత నిరుద్యోగులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం



లెదర్‌పార్కు ప్రారంభం కోసం దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. ప్రారంభిస్తే రెండు వేల మందికి ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా మా దళితుల తలరాతలు మారడం లేదు. లెదర్‌పార్కుపై ఆశలు వదులుకుని కూలీ పని చేసుకుని కుటుంబాలు గడుపుతున్నాం.

– గాదె ఈశ్వరయ్య, స్టేషన్‌ఘన్‌పూర్

చెన్నైలో శిక్షణ తీసుకున్నాం



లెదర్‌పార్కు ప్రారంభిస్తారని తమకు 2004లో చెన్నైలో శిక్షణ ఇచ్చారు. లెదర్ ఉత్పత్తుల తయారీపై చెన్నైలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇంతవరకూ లెదర్‌పార్కు ప్రారంభం అనేది మాకు తీరని కలగానే మిగులుతుంది. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ సమస్యపై ప్రత్యేక చొరవతో పనిచేయాలి.

–చేపూరి కుమార్, ఛాగల్లు

ఖిలాషాపూర్ కేజీబీవీ అప్‌గ్రేడ్

- ఎంఎల్‌టీ కోర్సులో 40 సీట్లు

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయం అప్‌గ్రేడ్ అయింది. ప్రభుత్వం ఈ ఏడాది ఇంటర్మీడియట్ వరకు పొడిగిస్తూ ఒకేషనల్ కోర్సు (ఎంఎల్‌టీ) మంజూరు చేసిందని కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ జి.హేమలత శనివారం తెలిపారు. ఈ కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తిగల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విదంగా 6వ తరగతిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 9666930586 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

వార కల్యాణం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో వార కల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. భక్తులకు కాజీపేటకు చెందిన నార్లగిరి సమ్మయ్య –అహల్య, ప్రశాంత్–ప్రత్యూషలు అన్న ప్రసాద వితరణ చేశారు.

'తిరంగా యాత్ర'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: పహల్గాం ఉగ్రదాడిని తిప్పికొడుతూ ప్రధాని నరేంద్రమోదీ భారత సైన్యంతో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా ఇండియన్ ఆర్మీకి మద్దతుగా ఈనెల 19వ తేదీన జనగామలో నిర్వహించనున్న తిరంగా యాత్రకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు కోరారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల చెందిన బీజేపీ అధ్యక్షులతో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని భారతసైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిందని, దాయాది పాకిస్తాన్‌కు వణుకు పుట్టించిందన్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీకి మద్దతుగా జిల్లా కేంద్రంలో 19న సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న తిరంగా యాత్రకు ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరవుతున్నారన్నారు. ప్రజలు, ప్రజాసంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, వివిధ మండలాల మండల పార్టీ అధ్యక్షులు సట్ల వెంకటరమణ, కోరుకొప్పుల నాగేష్, బైరపాక కుమార్, కాట్రేవుల రాజు, గంటె ఉపేందర్, పుప్పాల వేణు, కొండబోయిన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'గీత కార్మికులను వేధించడం సరికాదు'



మాట్లాడుతున్న గోపి

జనగామ రూరల్: గీత కార్మికులను వేధింపులకు గురిచేయడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి అన్నారు. శనివారం పసరమడ్ల తాటివనంలోని కంఠమహేశ్వర గుడి ప్రాంగణంలో కుర్రముల సిద్దయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య మాట్లాడారు. పసరమడ్ల గ్రామంలోని కల్లుగీత కార్మికులపై హైదరాబాద్‌కు చెందిన మున్నూరు కాపు కులస్తుడు ఖాతా ప్రవీణ్ అసత్య ఆరోపణలు చేస్తూ వేధించడం మానుకోవాలని అన్నారు. ప్రవీణ్ కొంత కాలంగా గీత కార్మికులు లైసెన్సులు లేకుండా ట్యాపింగ్‌లు చేస్తున్నారని, కల్లు కల్తీ చేసి విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపణలు చేస్తూ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని దుయ్యబట్టారు. 200 మంది గీత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, వారి ఉపాధిని దెబ్బతీయడం తగదన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న అతనిపై చర్య తీసుకోవాలని కోరారు. మార్క ఉపేందర్, వడ్లకొండ వెంకటేశ్వర్లు, కుర్రముల పరశురాములు, రాంపల్లి మైసగౌడ్, సుధాగోని ఆంజనేయులు, కొర్రెముల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీపీఐ అండ : మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న రాజారెడ్డి

చిల్పూరు: పేదలకు సీపీఎం ఎప్పుడూ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డి అన్నారు. శ్రీపతిపల్లి గ్రామంలో సీపీఐ మండల స్థాయి నాల్గో మహాసభ శనివారం మండల కార్యదర్శి బోనగిరి కుమారస్వామి అధ్యతన నిర్వహించారు. మొదట గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భూపోరాటాల్లో అమరులైన నాయకులకు, భారత్–పాక్ యుద్ధంలో అమరులైన జవాన్‌లకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి కుమారస్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుగుణమ్మ, పైస రాములు, మండల సహాయ కార్యదర్శి పిట్టల కుమారస్వామి, రచ్చ వెంకటయ్య, మోతె రాజయ్య, కట్ట ఎల్లయ్య, నరసయ్య, లింగయ్య, భిక్షపతి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల దోపిడీకే అంతర్గత దాడులు

దేవరుప్పుల: బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల దోపిడీ కోసం అంతర్గత దాడులకు పూనుకుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న ఆరోపించారు. మండలంలోని కడవెండి దొడ్డి కొమురయ్య స్మారక భవనంలో సీపీఐ 4వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు ఎడ్ల సోమనారాయణ ఎర్రజెండా ఆవిష్కరించగా సమావేశానికి సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మండల సీపీఐ కార్యదర్శిగా జీడీ ఎల్లయ్య(కడవెండి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, హమాలి సంఘం జిల్లా అధ్యక్షుడు యాకుబ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాప్పరి సోమయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రమేశ్

దేవరుప్పుల: ఏడాదిన్న కాంగ్రెస్ పాలనలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటమే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఈ నెల 27,28,29 తేదీల్లో =మండల కేంద్రంలో తలపెట్టిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల జయప్రదం కోసం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సన్నాహక సమావేశానికి గద్దం యాదగిరి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వం పాలకులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ, ఐలాపురం నరసమ్మ, రెడ్డి రాజుల నారాయణ, కొప్పుల ఉప్పలయ్య, పయ్యల బిక్షపతి, చింత మైసయ్య పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈ లక్ష్మీనారాయణ

చిల్పూరు: లోటఓల్టేజీ సమస్య నివారించేందుకు లింగంపల్లి గ్రామానికి 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు అయిందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని సమ్మక్క–సారలమ్మ జాతర జరిగే ప్రదేశం సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని శనివారం పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ వినిత్, ఎల్‌ఎం కృష్ణంరాజు, ఎల్ఐ చంద్రశేఖర్, కాంట్రాక్టర్ సురేందర్, నాయకులు ఏదునూరి రవీందర్, శ్రీనివాస్, రాజన్న, బుచ్చిరాజు, వీరన్న, చంద్రమౌళి, యాదగిరి, ఎలేంద్ర, సుధాకర పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి లక్ష్మీనారాయణ మృతి

- ఎమ్మెల్యే పల్లా పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ సభ్యుడు మాదంశెట్టి లక్ష్మీనారాయణ (71) శనివారం మృతి చెందారు. మృతుడి కుమారుడు రాము అంగీకారంతో వరంగల్ ఎల్‌వీ ప్రసాద్ వైద్య కళాశాల ప్రతినిధి గోకారపు నరేందర్ ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలను సేకరించారు. జిల్లాలోని అనేక ప్రాంతాలకు సుపరిచితుడైన వ్యాపారి లక్ష్మీనారాయణ మృతి వార్త తెలుసుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో లయన్స్ క్లబ్ ఆబాద్ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వర్ రావు, పూర్వ జిల్లా గవర్నర్లు డాక్టర్ లవకుమార్ రెడ్డి, కన్న పరశు రాములు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజిరెడ్డి, కత్తుల రాజిరెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, చింత కింది మల్లేశం, రాముని శ్రీనివాసులు, బుస్సా సిద్దేశ్వర్ ఎం.అశోక్, వెంకట లింగం, వెంకట మల్లారెడ్డి, రేణుకుంట కృష్ణ, బెజుగం భిక్షపతి ఉన్నారు.



లక్ష్మీనారాయణ (ఫైల్)

పాముకాటుతో మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: పాముకాటుకు గురై మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన వేముల లక్ష్మి(65) మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున వర్షం కురవడంతో గ్రామానికి చెందిన లక్ష్మి తమ ఇంటి ముందు ఉన్న తులసిగద్దె సమీపాన ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తుంది. ఈ క్రమంలో రాళ్లలో ఉన్న విషసర్పం ఆమెను కాటువేసింది. ఆమె కేక వేయడంతో లక్ష్మీ పాముకాటుకు గురైనట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో బరోడా బ్యాంకు సమీపాన స్నేహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక అభ్యుదయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు పోశాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేలా స్నేహ కార్పొరేషన్ వారు ప్రతీ వేసవిలో చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. యంజాల ప్రభాకర్, పాలకుర్తి సోమశేఖర్, గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


జనగామ రూరల్: పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మాదంశెట్టి లక్ష్మీనారాయణ మృతి పార్టీ తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శనివారం అనారోగ్యంతో మృతి లక్ష్మీనారాయణ మృతదేహానికి రాజారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న, శ్రీనివాస్, సోమయ్య, ఐలయ్య, సుదర్శనం ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

అర్హులను ఎంపిక చేయాలి

జఫర్‌గఢ్: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే వరకూ బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు బుర్ర తిరుపతిగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాల్సిందిపోయి ఇందిరమ్మ కమిటీల పేరుతో అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారన్నారు. ఉప్పుగల్లు గ్రామంతో పాటు అన్ని గ్రామాల్లో అనర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అర్హులను ఎంపిక చేయాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 23వ తేదీన పేదలతో గ్రామపంచాయతీ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

హనుమాన్ శోభాయాత్ర



లింగాలఘణపురం: మండల కేంద్రంలో శనివారం హనుమాన్ మాలధారణ భక్తులు హనుమాన్ భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి శోభయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఉత్సవ విగ్రహాన్ని భక్తి పాటలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. గ్రామస్తులు కొబ్బరి కాయలు, మంగళహారతులు, కట్నకానుకలు సమర్పించారు. కాసోజు సత్యం, లింగాల అనిల్, బొంకురు రమేష్, కుమార్, ప్యాట నరేశ్ పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లిన మాలధారులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాలకు చెందిన హనుమాన్ మాలాధారులు శనివారం పాదయాత్రగా పవిత్ర పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. ముందుగా స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలో ప్రధాన వీధుల గుండా హనుమాన్‌స్వాములు సామూహికంగా నగరసంకీర్తన చేపట్టారు. భక్తులు గద్దం విష్ణు, పొన్న గౌతమ్, రవీందర్, శ్రావణ్, అమరేందర్, గట్టు కుమార్, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

హోమం



జఫర్‌గఢ్: తిమ్మంపేట గ్రామంలో కొండపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయంలో హనుమాన్ భక్తులు భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. ముందుగా హనుమాన్ భక్తులు శోభాయాత్రను నిర్వహించారు. దాత చాడ రాజేందర్ హనుమాన్ భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 2020 నుంచి 2024వరకు చదివి 19 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన విద్యార్థులకు ఇన్ఫోసిస్ వారి సహకారంతో రాష్ట్ర సంక్షేమ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కృతమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు స్థానిక కళాశాలలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు..



యాదగిరిపై వ్యతిరేకంగా సమావేశం నిర్వహిస్తున్న మరోవర్గం

తరిగొప్పుల: కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు రోజురోజుకూ మితిమీరిపోతోంది. అధికారంలో ఉన్నమా... లేదా అనే దానితో సంబంధం లేకుండా ఆ పార్టీలో వర్గపోరు మాత్రం ప్రతీరోజు తారాస్థాయికి చేరుకుంటోంది. ఓ వైపు మండల అధ్యక్షుడు ఇతర పార్టీల నుంచి చేరికలు చేపిస్తూ పార్టీలో జోష్ పెంచుతుంటే మండలకేంద్రానికి చెందిన కొందరు నాయకులు అతనిపైనే తిరుగుబావుట ఎగరవేస్తుండడంతో మండల వ్యాప్తంగా చర్చనియాంశమంగా మారింది. పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి కార్యకర్తలకు సమాచారం లేకుండానే పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని కొందరు నాయకులు ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలు సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను ఏకం చేస్తున్నారు. దీంతో వారికి ధీటుగా సమాధానమిస్తూ మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపుతూ సమావేశం ఏర్పాటు చేస్తూ ఒకరిపై ఒకరు విమర్శించుకుంటున్నారు. తాజాగా మరోమారు మండల అధ్యక్షుడు యాదగిరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మండలకేంద్రం గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. వర్గపోరు అటుంచితే పార్టీకి చెడ్డపేరు వస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డీసీసీ అధ్యక్షుడు చొరవతీసుకొని పార్టీలో కొనసాగుతన్న వర్గవిభేదాన్ని పరిష్కరించాలని కోరుతున్నారు.